

సముద్ర తీరాన వుండే ఆ నాల్గంతస్తుల పెద్ద భవంతికి "కళ్యాణి" అంటారు. నాలుగో అంతస్తులో మాత్రమే చిన్న నివాసపు వాటా ఒకటుంది. ఆ ప్రాంతములో ఇళ్ళను వాటి పేర్లనుబట్టి గుర్తించొచ్చు. బొంబాయినగరములోని ఆ మేడను ఎవరైనా తేలికగా గుర్తుపట్టగలరు.

ఆ మేడమీద వాటాలో విందొకటారోజు ఏర్పాటయింది. అయితే అందులో క్రొత్తేమీ లేదు. ఏదో ఒక కారణముతో ప్రతిపూటా అక్కడ విందు భోజన సమావేశాలు జరగటము మామూలే. ఎవరో ఒకరు తమ స్నేహితులను ప్రతి రోజు విందుకు అక్కడకు పిలుస్తుంటారు. ప్రతి భోజనానికి ముందు ఏదో పానీయము యిస్తూనే వుంటారు. స్త్రీ పురుష జంటల చేతులలో మధువుతో నిండిన పెద్దపెద్దగ్లాసులున్నాయి. ఎవరి గ్లాసూ ఖాళీ కాకుండా చూస్తూ "బాయ్" హడావుడిగా ప్రతిచోటికి రెండు సీసాలు పట్టుకొని తిరుగుతున్నాడు.

బయట ఎడ తెరపి లేని వర్షం. బాల్కనీ దగ్గర నిలబడిన నేను భూమ్యాకాశాలు కలిసేచోటును చూస్తున్నాను. నా దృష్టి సెక్రటేరియట్‌కు ముందున్న రోడ్డుపైనుండి సముద్రపు కెరటాలపై నిలిచింది. ఇచ్చట అరేబియా సముద్ర దృశ్యం భయంగాని, ఉత్సాహంగాని కలుగజేయలేక పోతున్నది. నగర వాతావరణానికి, సముద్రము తలవంచినట్లు కనబడుతోంది. అందుకేనేమో వర్షపు జల్లులు సముద్రము పైనే పడ్తున్నాయి.

"కొద్దిమంది నిరంకుశత్వానికి, నెమ్మదైన పలువురు అమాయకులు బలి కావలసినదేనా? బహుశా అది అంతేనేమో? తమను నిలదొక్కుకోడానికే వారలా చేస్తుంటారేమో? ఆ ఏర్పాటులో ఏముందో" అని నాలో నేననుకుంటున్నాను.

"మీరేమి యిక్కడున్నారు?" నా ఆలోచనల కంతరాయం కలుగగా వెనుదిరిగి చూసాను. నా ప్రక్కన రెండు గ్లాసులు పట్టుకొని రోమా నిల్చొన్నది. గ్లాసొకటి తీసుకొని 'రెండవదెవరికి' అన్నాను. "నేను కూడ ఇటువంటివి తాగను." నవ్వుతూ అందామె. ఉల్లాసముతో ఆమెకో కుర్చీ చూపించి, మరో కుర్చీలో కూర్చున్నాను. అప్పటికే వర్షం హెచ్చింది. మాపై తుంపరలు వచ్చి పడుతున్నాయి. రోమా కట్టిన కంచిపట్టుచీర పాడవుతుందని "నీ చీర తడుస్తోంది. లోపలికెళ్లాలంటే వెళ్ళు, రోమా' అన్నాను.

ఆమె తలాడించి 'అదేమీలేదుగాని, నేనుండకుం మీ కిష్టం లేకపోతే మాత్రము తప్పకుండా-వెళ్ళిపోతా'నంది. నేనామె చెయ్యి పట్టుకుంటూ - 'ఏమలా అంటున్నావు? నిజానికి నా మనస్సు విప్పి మాట్లాడుకునే ముఖ్య స్నేహితురాలివి నీవొకతెవు' అన్నాను.

'అయితే త్రాగే వాళ్ళందరినీ మీరసహ్యించుకుంటున్నారా?- అని ధైర్యముగా రోమా అడిగింది. 'నేనెందుకు అసహ్యించుకోవడం! అవి నాకిష్టం లేకనే, బయటకి వచ్చేశాను గదా!' అన్నాను.

ఇంతలో మధుసేవన ప్రాధాన్యత గూర్చి ఒక పార్సీమహిళ ధారాళముగా చెప్తోంది. మేము ఆ విమర్శలను నెమ్మదిగా వింటున్నాము.

'ప్రపంచములోని యితర మనుషులవలె, మనదీ సామాన్య మానవ పుట్టుకే గదా! మన మెందుకు తాగరాదు! ఈ మోసమెందుకు అంటోంది ఆమె.

ఆ చక్కని వాదనకు నవ్వాపుకోలేకపోయాను నేను. 'నాగరికులమనిపించుకోవాలంటే విందులలో త్రాగడమవసరమా? ఎక్కడ, ఎప్పుడు, ఎవరు. దీనిని చెప్పారు? ఆ గొప్ప వ్యక్తి ఎవరు?- అనుకున్నాను.

బహుళ నన్నుద్దేశించి అన్నమాటలే అవి. అర్థము చేసుకున్న రోమా ఏదో తప్పు చేసిన దానిలా భావిస్తున్నట్టు కనబడింది. ఆ భావాల్ని పసిగట్టి ఏ తప్పూ చేయని రోమాను రక్షించాలనుకున్నాను. నన్నామె కోసమే రోమా తండ్రి ఆహ్వానించేరు. అందుకే ఆమె చేతినందుకొని - 'రోమా! మనము బీచివైపువెళ్దామా!'అంటూ ఆమెను బయటకు తీసుకుపోయాను.

'బయట వర్షం పడ్తోంది. భోజనాలకు ఏర్పాట్లు కూడా పూర్తయినట్లున్నాయి' అందామె. లోపల, నాకు టేబుల్సుపై ఖాళీ గ్లాసులే దర్శనమిచ్చాయి. ఆ పెద్ద హాలులో అక్కడక్కడున్న ఇద్దరో ముగ్గురో ఆహ్వానితులు ఏమీ తోచనివారులా ఉన్నారు. తెల్ల గౌను ధరించిన సినిమానటి, మొదట వున్న చలాకీతనము తగ్గగా, ఇపుడొక, పరుపుపై విశ్రాంతి తీసుకొంటోంది. ఆమెను సంతోషపెట్టే తాపత్రయముతో ఇద్దరు పెద్దమనుష్యులామె పాదాల దగ్గిర కూర్చున్నారు.

ఇంతలో శామ్యూల్ అక్కడకు వచ్చి, భోజనాలకు రావలసిందిగా అందరినీ ఆహ్వానించాడు.

• • • •

సాగర తీరంపై రోమా పరుగెడుతోంది. ఇసుకపై ఆమెకాలి గుర్తులు చక్కగా కనబడుతున్నాయి. ఇసుకలోని ముత్యాలనేరుకుంటూ ఇతరుల ననుసరిస్తోంది.

కొబ్బరి తోటల వెనుక చంద్రుడ స్తమిస్తున్నాడు. తూర్పున సూర్యోదయంకూడ అవుతోంది. ఆమె ప్రతిరోజు సూర్యోదయ దృశ్యాన్ని చూస్తుంటుంది. సూర్యాస్తమయానికి ముందు జాలరిపల్లె నుండి స్త్రీ పురుషులు తీరానికి వస్తుంటారు. సముద్రంలో చేపలు పట్టడానికి నావలపై అప్పుడే జాలర్లు వెళ్తారు. అప్పుడప్పుడు అందమైన ఉదయ సూర్యకిరణాల మధ్యగా వాళ్ళు చేపలతో నిండిన నావలతో సముద్రంనుండి తిరిగి వస్తారు. తీరంవెంబడి సంబరమేదో జరుగుతోందా అన్నట్లు, పిల్లలు పెద్దలు ముసలాళ్లు కేకలు పెడుతూ తిరుగుతారు. ఆ వేళలో సముద్ర తీరమంతా జీవకళతో నిండిపోతుంది.

ఈ దృశ్యం రోమాకు అతిసామాన్యమైందే. దాన్ని ప్రతి రోజూ ఆమె చూస్తున్నా, ఆమెకు చాలా ఆనందం కలిగించేదా దృశ్యం. తన ఉనికిని కూడ మరచిపోయేది, వారి మధ్యన గడుపుతున్నపుడు.

విశాలమైన కళ్ళతో చూస్తున్న ఆమె చూపులో సముద్రమంతా ఆమె యింట్లోకి విస్తరిస్తోందా అనిపించేది.

'సముద్ర తీరాన జీవితం ఎంత తేలికైందో, క్రమమైనదో మీకు తెలుసునా? అది అనుభవించి తీరాలిసిందే! సముద్రతీర జీవితానికి, భూమిపై జీవితానికి ఎంతతేడా! అదీ ఒక అనుభవమే. సుమా!' అంది రోమా.

ఇంతలో పెద్ద నిట్టూర్పొకటి విడిచిందామె. నాకామె కండ్లలో సముద్రపు నీడ మెదులుతున్నట్లనిపించింది. అనంత జలరాశిలో, ఇనుపదూలములు, సిమ్మెంటు, ఇటుకలతో కట్టిన భవనాల ప్రమేయము లేని చోట ఎవరి కోసమో, ఆమె వెతుకు తున్నట్లుందామె. అయితే ఆమె ఎవరిని వెతుకుతోంది? రోమా పటేల్ బాగా చదువుకున్న ఈ తరం యువతి. ఎప్పుడూ సందడిగా వుండే బొంబాయి నగరములో హడావుడిగా వుండే ఒక పెద్దింటి అందాల ఆడపడుచు.

ఆమెతో నా పరిచయమెలా అయిందీ మీకు నేనింతవరకు తెలుపలేదు. అలా తెలియకపోవడం కూడ మంచిదనే నా నమ్మకం. ఆకస్మికంగ ఏర్పడిన పరిచయమని తెలిస్తే చాలు. బహుళ మొదటి చూపులోనే మా యిద్దరము ఆకర్షితులమైనాము. సందడిగా వుండే బొంబాయి నగరంలో క్రమశిక్షణ ప్రశాంతతతో కూడిన చక్కని ముఖాకృతి గలిగిన ఆమెను నేనెంతగానో ఆరాధించాను. నా సన్నిహిత మిత్రులలో ఒకామెగా ఆమెను చేర్చుకున్నాను.

"మీ కుటుంబములో ఎవరిలోనూ లేని ప్రత్యేక భావాలు నీకు ఎలా కలిగాయి?-" అని ఆకస్మాత్తుగ ఆమె నడిగాను.

ఆతృతగా ఆమె నావైపు చూసింది. తర్వాత నెమ్మదిగా 'నాలో ప్రత్యేకత వుందా? మీరలా నిజంగానే భావిస్తున్నారా? నా స్నేహితులుకూడ అటువంటి విమర్శలనే చేస్తూ, నన్ను హాస్యం పట్టిస్తుంటారు. నే నెవరి ప్రేమలోనో పడ్డానని చెప్తారు. మీరు నమ్మినా నమ్మకపోయినా సరే, నేనుమాత్రం ఎవరినీ ఆ దృష్టితో చూడలేదు. మనుషులు నిజంగా అనాగరికులు, హింసాపరు లనిపిస్తుంది నాకు. వారి కళ్ళలో ఎంత ఆతురత ఉంటుందని! నాకదంతా అసహ్యం"-

సముద్రపు టావలి గట్టు నుండి వచ్చేమాటల్లా బొరాకరమైన గొంతుతో నెమ్మదిగా చెపుతోందామె.

ఆరకం మనుషులంటే ఆమెకుగల విసుగు. అసహ్యం, అమె కళ్ళలో ప్రతిబింబించేవి. 'మెరైన్ డ్రైవ్' వరకు నడిచాము మేము. ఇక్కడ ప్రకృతిని పరిమితముచేసి తమశక్తిని స్థాపించ టానికి మానవ హస్తాలు ప్రయత్నిస్తున్నాయి. సముద్రాన్ని పూడ్చి, పట్టణాన్ని పెంపు చేస్తున్నాయి. మానవ దృష్టికిదొక ఘనవిజయంగా కనబడుతోంది.

"నాకీ 'మెరైన్ డ్రైవ్' అంటే ఎందు కిష్టంలేదో మీకు తెలుసునా?" ఆమెవైపు ఆతురతగా చూసాను. 'మనుషులు సముద్రాన్నిక్కడ పూడ్చి తమ ప్రతాపాన్ని చూపిస్తుంటే, తనలలను అదే పనిగా సముద్రం భూమిపైకి లాకిస్తున్నది, చూసారా? సముద్రమంటే ముఖ్యంగా కోణార్క దేవాలయం దగ్గర సముద్రం నాకెంతో యిష్టం.

'నీవు పూరీచూసావా?, కోణార్కకూడా వెళ్ళావా?' ఆశ్చర్యముతో అడిగానామెను.

విరగబడి నవ్విందామె. మీరెందుకలా ఆశ్చర్యపోతున్నారు ? సముద్రం భూమినితాకే చాలాచోట్లకు వెళ్ళానునేను. అయితే అట్టి ప్రదేశాలన్నిటికీ వెళ్ళలేక పోయాను.'

'చాలా వింతగావుందే సముద్రం గురించి పరిశోధనేమైనా చేస్తున్నావా?'

విషాదముతో కూడిన చిరునవ్వొకటి వెలువడిందామె పెదవుల నుండి. 'అలాపరిశోధన చేసినా బాగుండేది. సముద్రంలో ఎన్ని ప్రాణులున్నాయో? శాస్త్రగ్రంథాలు వీటిని గూర్చి ఏమిచెబుతున్నాయో తెలిసి వుండేది.'

ఇంటివైపు నడక సాగించానునేను. నా బట్టలు తడిసాయి గనుక తొందరగానే నడుస్తున్నాను. కాని ఆమెవేసే అడుగులలో మార్పులేదు. సముద్రం వేపేచూస్తోందామె. భయం లేకుండా అటే వెళ్తోంది. కోపం వచ్చిందినాకు. సముద్రంతో ఎంతవింతైన అనుబంధ మీమెకు! వర్షం పడుతూనే వుండిగాని దానిని పట్టించుకోలేదామె.

రోమాను నేను ఎచ్చటో వెనుకగా విడిచి హోటలు గదికి తిరిగి వచ్చేశాను. ఆమె మరెచ్చటికో వెళుతోంది. రోగులు క్లినిక్‌లో ఎదురు చూస్తుంటారామెకోసం. టెలిఫోనులో ఆమెతో మాట్లాడాలన్నా, ఆమె పనికి భంగం కలుగుతుంది గనుక, అది సాధ్యపడలేదు.

మరునాడుదయం విమానంలో వెళ్ళేందు కేర్పాట్లు చేసుకుంటు న్నాను. అకస్మాత్తుగా టెలిఫోన్ మ్రోగింది. రోమా ఫోనుచేసుంటుం దని ఆతురతగా రిసీవర్ ఎత్తాను. రోమా తండ్రిగొంతు ఫోనులో విన బడుతోంది. 'గతసాయంత్రం నీతో సముద్ర తీరానికి అమ్మాయి వచ్చిందా'?

నిర్ఘాంతపోయానునేను. 'ఏమిజరిగింది? ఆమెతిరిగి రాలేదా'?

'అవును ఈ ఉదయం సముద్రపుతీరం నుండి తీసుకొనివచ్చాం. పూర్తిగా తడిసి స్పృహ లేకుండా అక్కడే పడుంది రాత్రంతా. స్పృహరాలేదింకా. ఆమెకు తిరిగి స్పృహవచ్చే విషయంలో డాక్టర్లు కూడా సందేహిస్తున్నాడు' నెమ్మదిగా అంది అవతలి గొంతు.

'ఆ నేరం నీదేనని'- నామనస్సు చెబుతోంది. అయన ఇంకా ఇలా అన్నాడు- 'సముద్రతీరానికి ఆమెనెప్పుడూ మేము ఒంటరిగా పంపించం. ఆ దృశ్యంతో ఆమె పిచ్చిదై ఇంటికి తిరిగిరావటానికి యిష్ట పడదు...'

'కాని, ఆమె ఇట్లా ఎందుకు ప్రవర్తిస్తుంది'- అడిగాను, అతని మాటల కంతరాయం కల్పిస్తూ.

విషాదభరితమైన నవ్వొకటి వినిపించింది. 'మాకు సముద్ర తీరాన రోమా దొరికింది. బహుశా ఆమెతల్లి సముద్రతీరానామెను వదలి,ఆత్మహత్య చేసుకుని వుంటుంది. రోమాకు ఈ విషయమెప్పుడూ తెలియదు. ఆమెకు తెలిసిందల్లా, నా కూతురుగ మాత్రమే. అయినా సముద్రంతో ఆమెకుగల సంబంధం మాత్రం అర్థంలేనిది, వింతైనది. ఎప్పుడూ సముద్రంలోనికి వెళ్ళాలనే కోరుకుంటుంది. సముద్రందిగువగా ఆమె ఏదో కనుగొంటుందేమోనని పిస్తుంది....'

నేనిక భరించలేక పోయాను. ఏమి మాట్లాడాలో తెలియక ఫోను పెట్టేశాను.

టాక్సీకి నా సామాన్లు తీసుకెళ్ళడాని కొచ్చిన 'బాయ్' నావైపు వింతగా చూస్తున్నాడు. నేను కన్నీరు కారుస్తూ మూగగా రోదిస్తున్నానేమో!